


సైన్స్‌సెంటర్‌లో వృక్షాలకు క్యూఆర్‌కోడ్ ట్యాగులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



ఇది మంచి ప్రయత్నం

ట్యాగ్ ఏ ట్రీ ద్వారా వృక్షాలకు సంబంధించిన విషయాలతో పాటు ఔషధ ప్రాముఖ్యతను గురించి తెలుసుకోవడానికి వీలవుతుంది. దీనిని చూశాక మన ముందున్న చెట్టు ఎంత విలువైనవో అర్థమవుతుంది. మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

- నిర్మల, తిరుపతి

ట్యాగ్ ఏ ట్రీ

సైన్సు సెంటర్‌లో 50 వృక్షాలకు క్యూఆర్ కోడ్

మంగళం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఎన్నో వృక్షాలు, మొక్కలు, వనమూలికలు ఉన్నాయి. వాటి గురించి చెప్పగలిగే వాళ్లు అరుదే. దీనిని అధిగమించేందుకు చెట్ల పేరు, అది ఏ ప్రాంతంలో ఎక్కువగా పెరుగుతుంది, దాని లక్షణాలు తదితర వివరాలు అందరికీ తెలియజేయడానికి తిరుపతిలోని సైన్స్‌సెంటర్ ట్యాగ్ ఏ ట్రీ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలుత 50 వృక్షాలకు క్యూఆర్‌కోడ్ ట్యాగింగ్ ఏర్పాటు చేయగా.. దశలవారీగా మిగతా వాటికీ అమర్చనున్నారు. ఈ సైన్స్ సెంటర్‌లో ప్రస్తుతం 1500కుపైగా చెట్లున్నాయి. వీటిలో అరుదైన వృక్షాలు, మొక్కలు, విదేశాలకు చెందిన చెట్లూ ఉన్నాయి. రాయల్‌పామ్, ఫిష్టైల్‌పామ్ వంటి తాటి రకాలు, బొంబాక్స్ సెయిబా, గుల్మోహర్, ఎల్లో ఫ్లేమ్ ట్రీ వంటి పుష్పించే చెట్లతో పాటు జీడిపప్పు, మామిడి వంటివీ ఉన్నాయి. ఆయా వృక్షాల ద్విపద పేరు, సాధారణ పేరు, వర్గీకరణ, స్థానిక పేర్లు, స్థానికత, లక్షణాలు, బయో జియోగ్రఫీ, యత్నో బోటానికల్ వాటికి సంబంధించిన ఫొటోలు కనిపిస్తాయి. దీని ద్వారా ఆ వృక్షాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

సందర్శకుల నుంచి సానుకూల స్పందన



'ట్యాగ్ ఏ ట్రీ' కార్యక్రమానికి సందర్శకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ చెట్ల వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రస్తుతానికి ఆంగ్ల భాషలో ఈ సమాచారం అందుబాటులో ఉంది. త్వరలో తెలుగు, హిందీ భాషల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తాం.

- పురుషోత్తం, సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్

సాంకేతికతను జోడించడం అభినందనీయం

చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యతను తెలియజేస్తూ దీనికి సాంకేతికతను జోడించడం అభినందనీయం. వృక్షాల గురించి తెలుసుకోవడం, వాటిని కాపాడుకోవడానికి ట్యాగ్ ఏ టీ ఉపయోగపడుతుంది.

- విజయ, చిత్తూరు



వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, తిరుపతి అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజరెడ్డి తదితరులు

చిత్తూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ పర్యవేక్షించారు. బదిలీల కోసం ఆప్షన్‌ను నమోదు చేసుకున్న చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వార్డు కార్యదర్శులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. వార్డు అడ్మిన్ కార్యదర్శులు 153 మంది, వార్డు అమినిటీ కార్యదర్శులు 178 మంది, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 143 మంది కలిపి మొత్తం 474మంది హాజరయ్యారు. తిరుపతి నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ చరణ్‌తేజ రెడ్డి, చిత్తూరు సహాయ కమిషనర్ ప్రసాద్, పురపాలక సంఘాల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో

ఎంఎస్ఎంఈలు కీలకం

- నూతన సాంకేతికత, అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- యువపారిశ్రామిక వేత్తలకు మంత్రి కొండపల్లి పిలుపు



పలువురు పారిశ్రామికవేత్తలతో ఎంవోయూలు చేసుకుంటున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అధికారులు



ఎంఎస్ఎంఈ దినోత్సవానికి హాజరైన వారు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర కీలకమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాల్లో 90 శాతం.. ఉద్యోగాల్లో 70 శాతం వాటా వీటిదేనన్నారు. తిరుపతి సమీపం తాజ్ హోటల్‌లో శుక్రవారం జరిగిన ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నూతన సాంకేతికతను, అవకాశాలను అందిపుచ్చుకుని ఎంఎస్ఎంఈలు మరింతగా ఎదగాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై శాఖలతో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామిక వేత్త' దృష్టికోణంతో చంద్రబాబు ఎంఎస్ఎంఈలకు బ్యాంకు లింకేజీతోపాటు పలు సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇస్రో వంటి సంస్థల సమీపంలో అంతరిక్ష సంబంధిత ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వమే కాకుండా ప్రైవేటు సంస్థలనూ భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్నది సీఎం చంద్రబాబు గొప్ప నిర్ణయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ ఎస్పీ సోమనాద్ పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్లలో ఎంఎస్ఎంఈలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశంకర్‌రావు అన్నారు. జిల్లాలో 1.80లక్షల మంది ఎంఎస్ఎంఈ రంగాలపై ఆధారపడి ఉన్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 186 యూనిట్ల లక్ష్యానికి 647 యూనిట్లను సాధించారన్నారు. తిరుపతి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం తదితరులు ప్రసంగించారు.

9 ఎంవోయూలు

ఎంఎస్ఎంఈ దినోత్సవంలో వివిధ సంస్థలతో 9 ఎంవోయూలను కుదుర్చుకున్నట్లు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ విశ్వ తెలిపారు. నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్(వైజాగ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ (హైదరాబాద్), ఎన్ఐడీ, ఎన్‌పీసీ, సీఎస్‌టీ ఎంఎస్ఈ, ఎస్ఐడీబీఐ, ఎప్‌టీఈవో, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వారితో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. విశేష ప్రతిభ కనబరచిన ఎంఎస్ఎంఈలను, ఎన్ఎస్ఈ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ అయ్యర్‌ను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఎంఎస్ఎంఈ ఈడీ సుదర్శన్‌బాబు, జిల్లా పరిశ్రమల జీఎం చంద్రశేఖర్, ఏపీఐఐసీ జడ్ఎం విజయభరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ చెంచుబాబు, సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శుక్రవారం 20 కిలోల గంజాయి పట్టుకుని.. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ చెంచుబాబు తెలిపిన ప్రకారం.. సత్యవేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తొండా మునిశేఖర్, సూళ్లూరుపేట మండలం ఆబాకకు చెందిన ఏలిమేటి సతీష్, సూళ్లూరుకు చెందిన పాలా వినయ్, తడ మండలం గ్రద్దగుంటకు చెందిన మధురా జేష్, సత్యవేడు మండలం అయ్యప్పపాలెం గ్రామానికి చెందిన సోదవరం జ్యోతీష్ కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి సూళ్లూరుపేట, తడ, చెన్నై తదితర ప్రాంతాల్లో విక్రయించేవారు. శుక్రవారం మన్నారుపోలూరు వద్ద పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గంజాయిని తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. గంజాయిని పట్టుకున్న సీఐ మురళీకృష్ణ, సూళ్లూరుపేట, తడ ఎస్ఐలు బ్రహ్మానాయుడు, కొండపనాయుడు, సిబ్బందిని అభినందించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 281 మంది హాజరు

- నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి
- 30 నుంచి ఆప్షన్ల నమోదు

తిరుపతి(విద్య), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 281 మంది అభ్యర్థులు హాజరైనట్లు కౌన్సెలింగ్ జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. 1,04,001 నుంచి 1,20,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 193 మంది, సత్యవేడులో 15 మంది, గూడూరులో 73 మంది సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్నారు. శనివారం 1,20,001 నుంచి చివరి ర్యాంకు వరకు జరిగే కౌన్సెలింగ్‌తో సర్టిఫికెట్ల పరిశీలన ముగియనుంది. 30వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఆప్షన్ల నమోదు ప్రారంభమవుతుంది.



తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

మామిడి రైతులను ఆదుకుంటాం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తోతాపురి మామిడి రైతు నష్టపోకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 8 గుజ్జు పరిశ్రమల వద్ద తోతాపురి కాయలు కొంటున్నారన్నారు. ఇప్పటి వరకు పరిశ్రమలకు 30వేల టన్నులు, ర్యాంపులు, మండీల ద్వారా 25 టన్నుల మామిడి సేకరణ జరిగిందన్నారు.

శాంతి, సుభిక్షం కోసం స్కేటింగ్ యాత్ర

నాయుడుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతియుత వాతావరణం నెలకొని సుభిక్షంగా ఉండాలని బిహార్‌కు చెందిన రోహన్ స్కేటింగ్ ద్వారా పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. చెన్నై నుంచి శుక్రవారం నెల్లూరు వెళ్తున్న రోహన్ నాయుడుపేటలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 'బీజాపూర్‌కు చెందిన నేను వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నా. దేశంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ప్రార్థిస్తూ ఫిబ్రవరి 11న స్కేటింగ్ ద్వారా శాంతియాత్ర మొదలు పెట్టా.7 నెలల పాటు ఈ యాత్ర సాగనుంది'అని పేర్కొన్నారు.





ద్విచక్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ

ట్రాఫిక్ పోలీసులకు 27 బుల్లెట్లు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యలకు చెక్‌పెట్టేలా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 27 ద్విచక్ర వాహనాలను జిల్లాకు కేటాయించారు. తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో వీటికి శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజు పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ 27 వాహనాల్లో తిరుపతి సబ్ డివిజన్‌కు ఆరు, తిరుమలకు నాలుగు, తిరుపతి సిటీ డివిజన్‌కు మూడు, పుత్తూరుకు రెండు, శ్రీకాళహస్తికి రెండు, రేణిగుంటకు రెండు, నాయుడుపేటకు నాలుగు, గూడూరుకు రెండు, ఎంటీ హెడ్ క్వార్టర్స్‌కు మరో రెండింటిని కేటాయించామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, చంద్రశేఖర్, డీఎస్పీలు శ్యాంసుందర్, భక్తవత్సలం, రామకృష్ణమాచ్చారి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వాహనాల ప్రత్యేకత: ఎక్కడైనా ప్రమాదాలు జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా టైర్ల మన్నిక. హెవీ రేంజ్‌లో శబ్దం వచ్చేలా సైరన్లు. హై ఫోకస్ డిజిటల్ లైటింగ్ సిస్టమ్, వైర్‌లెస్ సెట్ ఉండేలా తయారు చేయించారు.

రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించండి



స్వామిని దర్శించుకుని వస్తున్న జయలక్ష్మి

తిరుపతి అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆటో మ్యూటేషన్‌లో తలెత్తే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ఆమె శుక్రవారం ఉదయం అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలో ఆటోమ్యూటేషన్ ద్వారా ఏర్పడే సమస్యలను సులభరీతిలో పరిష్కరించే శాస్త్రీయ విధానంపై రిజిస్ట్రేషన్, తహసీల్దార్ కార్యాలయాల అధికారులకు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అప్పటికే ఎంపిక చేసిన పుత్తూరు మండలానికి చెందిన నలుగురు బాధితులను కేస్ స్టడీస్ చేశారు. వారి సమస్యలను బాధితుల సమక్షంలోనే పరిష్కరించారు. అంతకుముందు ఆమె కార్యాలయ ప్రాంగణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, పుత్తూరు తహసీల్దార్లు సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడాదిలో 4 కోట్ల మంది సందర్శకులు: జేసీ



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): పర్యాటకంలో భాగంగా ఏడాది కాలంలో నాలుగు కోట్ల మంది జిల్లాను సందర్శించారని జేసీ శుభం బన్సల్ తెలిపారు. అందులో 2.6 కోట్ల మంది తిరుమల శ్రీవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్న టూరిజం కాంక్లేవ్‌లో జేసీ మాట్లాడారు. పర్యాటకరంగ అభివృద్ధిలో తిరుపతి జిల్లా ముందంజలో ఉందని, పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ప్రాచీన దేవాలయాలతో పాటు తీర ప్రాంతమూ ఉందన్నారు. సీఎం ఆదేశాల మేరకు పర్యాటక రంగానికి మరిన్ని వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.

డీపీటీవోగా జగదీష్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా జగదీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలోని డీపీటీవో కార్యాలయం చేరుకుని సంతకం చేశారు. అనంతరం రోజువారి కార్యకలాపాలలో పాల్గొన్నారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులు ఆయన్ను అభినందించి, సన్మానించారు.

లారీని అపహరించింది పూణేవాసులు



పోలీసులు స్వాధీనం చేసుకొన్న లారీ

చంద్రగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా వద్ద గురువారం రాత్రి లారీని అపహరించింది పూణేవాసులని పోలీసు విచారణలో తేలింది. అదే రోజు రాత్రి ఈ లారీని రైల్వే కోడూరు వద్ద పట్టుకుని.. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పూణేకు చెందిన ఓ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఫైనాన్స్ ద్వారా లారీని కొన్నారు. నెలవారీ కంతులు సక్రమంగా కట్టకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు ఆ లారీని స్వాధీనం చేసుకుని వేలం వేశారు. ఎవరూ పాడుకోక పోవడంతో లారీ విడి భాగాలను ముల్‌బాగిల్‌లో విక్రయించారు. కుప్పానికి చెందిన చరణ్‌కుమార్ లారీ ప్రమాదానికి గురై క్యాబిన్ పాడైపోవడంతో.. ముల్‌బాగిల్లోని ఓ మెకానిక్ వద్ద క్యాబిన్ వేయించుకొన్నాడు. ఆ క్యాబిన్ ఫైనాన్స్ కంపెనీ వారు విక్రయించిన క్యాబిన్. ఆ క్యాబిన్‌కు పూణేకు చెందిన లారీ ఓనర్ జీపీఎస్ ఏర్పాటుచేసి ఉంచాడు. ఈ క్రమంలో తన లారీనే నెంబరు మార్చి చరణ్‌కుమార్ నడుపుతున్నట్లు భావించి ఐదుగురితో కలిసి అపహరించాడు. వీరందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం


అధికారులతో సమీక్షిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 27(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరులో జరగనున్న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందించి విజయవంతం చేద్దామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.చెంగల్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చేపట్టిన చర్యలు, పెండింగ్ పనులు, ప్రణాళికలపై ఆరాతీశారు. వీలైనంత ఎక్కువ మంది భక్తులను ఆర్టీసీ బస్సుల్లోనే తిప్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బస్సుల మరమ్మతులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.

విద్యుత్ బస్సుల నిర్వహణపై శిక్షణ పూర్తి


సిబ్బందికి శిక్షణ ఇస్తున్న నిపుణుడు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఈ-బస్సుసేవ ద్వారా జిల్లాకు 50 బస్సులు (మంగళం డిపో) రానున్నాయి. బస్సుల నిర్వహణ విధానం, ప్రాథమిక అవగాహనపై నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. హైదరాబాదుకు చెందిన వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రతినిధులు డాక్టర్ ఎస్.అన్సారి, డాక్టర్ అమ్జాద్, డాక్టర్ బి.హరీష్‌బాబు, కృష్ణ అవగాహన కల్పించారు. జిల్లాలోని 11డిపోల అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మెకానిక్‌లు, గ్యారేజీ సిబ్బంది రెండు విడతల్లో హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఈడీ చెంగల్‌రెడ్డి హాజరై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈఓ బాలాజీ పాల్గొన్నారు.

మలబార్‌లో 'మైన్ డైమండ్' షో

తిరుపతి అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో 'మైన్ డైమండ్స్' షోను శుక్రవారం ప్రారంభించారు. ఇందులో రోజువారీ ధరించే నగలు, వివాహ, తేలిక బరువు, సొగసైన ఆభరణాలు అందుబాటులో ఉంచామని, ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని షోరూం హెడ్ రిజీష్ తెలిపారు. ప్రతి కొనుగోలుపైనా ప్రత్యేక ఆఫర్లు పొందవచ్చని, బంగారు, రత్నాలు, వజ్రాభరణాలపై తరుగు చార్జీలలో 30 శాతం తగ్గింపు సౌకర్యం కల్పించామని వెల్లడించారు.

దుకాణాలకు టెండర్ల ఖరారు

తిరుపతి అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తవీధిలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పరిధిలో నడుస్తున్న నాలుగు దుకాణాలకు శుక్రవారం టెండర్లు ఖరారయ్యాయి. ఉదయం జిల్లా దేవదాయశాఖ అధికారి పి.రామకృష్ణారెడ్డి, తనిఖీ అధికారి పణిరాజశయన ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల కాలపరిమితితో దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. తీర్థకట్ట వీధిలోని మూడు దుకాణాలకు వరుసగా నెలకు రూ.18వేలు, రూ. 21వేలు, రూ. 23వేలు, కొత్తవీధిలో ఉన్న ఓ దుకాణాన్ని రూ. 26,500లకు పాటదారులు దక్కించుకున్నారు. ఈ మేరకు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి నాలుగు దుకాణాల ద్వారా ప్రతినెలా రూ.88,500 ఆదాయం సమకూరుతుందని ఈవో మునిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తిరుపతి (ఆటోనగర్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామని ప్రజాసంఘాల నాయకులు వెంకటరత్నం, సి.పెంచలయ్య, ప్రభాకర్, ప్రమీల, శ్రీరాములు వెల్లడించారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా, కార్మిక సంఘాల నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్లకు దోచి పెట్టడానికి పటిష్టంగా ఉన్న 29 కార్మిక, కర్షక చట్టాలకు సవరణలు చేయడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు పోరాటాలు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 8 గంటల పనివిధానాన్ని రద్దు చేసి 10 గంటల పని విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నాలు చేయడం అప్రజాస్వామిక చర్య అని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో 5వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, కె.రాధాకృష్ణ తెలిపారు. జూలై 9న జరగనున్న సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా చూడాలని నిర్ణయించారు. సమావేశంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు ఎన్డీ రవి, లోకేష్, తులసీ రాజన్, కేవై రాజా, అల్లాబక్ష్, శ్రీనివాసులు, గౌస్‌బాషా పాల్గొని మాట్లాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరసన


దీక్షలో కూర్చున్న మహిళలకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నేతలు లక్ష్మి, బుజ్జి

తిరుపతి (వైద్యం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): కార్మికుల పట్ల స్విమ్స్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి సరైంది కాదని, వారి సమస్యలను పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాలు ఆగవని సీఐటీయూ మహిళా నేతలు లక్ష్మి, బుజ్జి అన్నారు. స్విమ్స్‌లో కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళలకు పూలమాలలు వేసి, మద్దతు తెలిపారు. కార్మికుల పట్ల స్విమ్స్ అధికారులు వివక్ష చూపడం, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, స్విమ్స్ కార్మికుల యూనియన్ నేతలు రాఘవశర్మ, వేణుగోపాల్, రవి, సూరిబాబు, మారిముత్తు పాల్గొన్నారు.

పద్మావతీ పాలిటెక్నిక్‌లో ఎన్‌బీఏ పర్యటన


రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌బీఏ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) పర్యటించింది. ఢిల్లీకి చెందిన ఎన్‌బీఏ ప్రతినిధుల బృందం సోమవారం కాలేజీని సందర్శించింది. గతంలో ఈ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు ఉంది. దీన్ని పునరుద్ధరించడం, కొనసాగించడం ఈ పర్యటన లక్ష్యం. ఇందుకు అవసరమైన రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం కాలేజీ, హాస్టల్, తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, గ్రౌండ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల వంటి సదుపాయాలు, పాటిస్తున్న ప్రమాణాలను పరిశీలించారు. ఎన్‌బీఏ ప్రతినిధులు అనంతరం ప్రిన్సిపాల్ పద్మావతమ్మతో సమావేశమయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని తిరుపతి ఆపరేషన్ సెక్షన్‌లో విద్యుత్ ఫీడర్లు, లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైరాగిపట్టెడ, హథీరాంజీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, ఎస్‌టీవీ నగర్ సమీప ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.09 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,879

తలనీలాలు సమర్పించినవారు: 23,960

హాకరు దుకాణాల తనిఖీ


దుకాణాల వద్ద తనిఖీ చేస్తున్న వెంకయ్య చౌదరి

తిరుమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్ వద్దనున్న హాకరు లైసెన్సు దుకాణాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. అనధికారంగా కొంతమంది వ్యక్తులు పాత లైసెన్సు పత్రాలతో వ్యాపారం చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం సాయంత్రం స్వయంగా పరిశీలించారు. స్థలాన్ని ఆక్రమించిన కొన్ని దుకాణాలను మూసివేసి, నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మహిళలు సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం సీఎల్టీ సెంటర్‌లో మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో కలసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. 169మంది ఆర్పీలకు గాను 153 మందికి అందజేశారు. ట్యాబ్‌లో 60 యాప్‌లు ఉన్నాయని, అన్నీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సర్వేలకు సంబంధించినవని చెప్పారు. ఇకపై ప్రభుత్వ సేవలన్నీ వాట్సప్ ద్వారానే అందించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్ణయించారని తెలిపారు. సాంకేతికంగా వస్తున్న మార్పులను మహిళలు త్వరగా నేర్చుకుని పురుషులతో పోటీపడాలని సూచించారు. కాగా 130 మంది డిజిటల్ లక్ష్మి పథకానికి సంబంధించిన మహిళలకు బయోమెట్రిక్ డివైజ్‌లను అందించారు. స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో మహిళలు రాణించేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఎంలు కృష్ణవేణి, సోమశేఖర్, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.


ట్యాబ్‌లు అందుకున్న మెప్మా ఆర్పీలతో ఎమ్మెల్యే శ్రీనివాసులు

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


కబ్జాకు గురైన స్థలం - గతంలో నిర్మించిన ఇళ్లు

తిరుపతి అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అర్బన్ మండలం మంగళం పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖల సర్వేనంబర్ 195/1లోని ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుండగా రెవెన్యూ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. ఆక్రమణదారులు ఎక్స్‌కవేటర్లు, నీటిట్యాంక్, ట్రాక్టర్లు, తాపీమేస్త్రీలు, కూలీలతో ఉదయాత్పూర్వమే ఆ ప్రాంతానికి చేరుకుని ఇళ్ల నిర్మాణాలకు దిగుతుండగా సమాచారం అందుకున్న వీఆర్వో ప్రసాద్ అక్కడికి చేరుకుని ఆధారాలు చూపించమని కోరారు. వారి నుంచి ఎలాంటి సమాధానమూ లేకపోవడంతో అర్బన్ తహసీల్దార్‌ను కలవాలని ఆదేశించారు. పనులను ఆపివేయించి, వారిని అక్కడి నుంచి పంపించేశారు. ఆక్రమణదారులు తహసీల్దార్ సురేష్‌బాబును కలిసి అదే ప్రాంతంలో ఇప్పటికే నిర్మాణాలున్నాయని, తమకూ పట్టాలున్నాయని వాదించారు. పట్టాలను చూపిస్తే సమగ్రంగా పరిశీలించి నిజమైతే వీఆర్వో ద్వారా అనుమతులు ఇస్తామని, ఆధారాలు లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే సహించేది లేదని స్పష్టం చేశారు.కాగా, గత వైసీపీ హయాంలో ప్రస్తుతం కబ్జాకు గురవుతున్న స్థలానికి పక్కనే ప్రభుత్వం స్థలంలో ఆరు నిర్మాణాలు ఉన్నాయి. అందులో కొందరు విక్రయించుకోగా మరికొందరు అద్దెలకు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను ఉపేక్షించమని, ఆధారాలు లేని కట్టడాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

పాఠశాలల విలీనం సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

తిరుపతి (ఆటోనగర్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో గత వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన విధానాలనే ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్నారని, విలీన ప్రక్రియ కారణంగా 5వేల ప్రాథమిక పాఠశాలలు మూతపడే అవకాశముందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. యశోదానగర్‌లోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అతి ముఖ్యమైన విద్యాశాఖలో గత వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు117ను తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో కలిపిందని తెలిపారు. ఆ జీవోను రద్దు చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని 33 వేల ప్రాథమిక పాఠశాలలను 28 వేలకు కుదించి, ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తోందన్నారు. కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలలకు 3, 4, 5 తరగతుల పిల్లలు ఎలా వెళ్లగ లరని ప్రశ్నించారు. తిరుపతి జిల్లాలో 583 ప్రాథమిక పాఠశాలలు విలీనం చేయడం బాధాకరమన్నారు. ఈ విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు.పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో గ్రావెల్ మాఫియా ను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పేదల ఇళ్లను కూల్చిన వారిని పోలీసులు అరెస్ట్ చేయడం లేదన్నారు. ఈ దౌర్జన్యాలపై నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని కోరారు. సమావేశంలో కందారపు మురళి, ఎ.పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, సాయిలక్ష్మి, మాధవ్, వేణుగోపాల్, మణి, రమేష్ పాల్గొన్నారు.

రోడ్లు విస్తరించి ఇబ్బందులు లేకుండా చూస్తాం


డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అంతర్గత రోడ్లను బాగుచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. 43, 44 డివిజన్ల పరిధిలోని రోడ్లను శుక్రవారం ఉదయం ఆయన పరిశీలించారు. 44వ డివిజన్ పరిధిలోని నర్సరీ వీధిని ఇంజినీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు ఆక్రమణలతో అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఇటీవల ఇద్దరు చనిపోయినట్లు స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ సమస్యతో దుర్వాసనకు తోడు దోమల బెడద ఎక్కువగా ఉందని వారు ఎమ్మెల్యేకు చెప్పారు. వర్షం పడితే డ్రైనేజీ నీరు నిల్వ ఉండిపోతుండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మరోవైపు రోడ్డును పూర్తిస్థాయిలో విస్తరిస్తే తమ ఇళ్లు దెబ్బతింటాయని నర్సరీ వీధి వాసులు తెలిపారు. ఈ వీధిలో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.76 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్డు విస్తరణపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 43వ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు వరికుంట్ల నారాయణ, నరసింహాచారి, నరేంద్ర, సీకే రేవతి, శైలజ, దూది కుమారి, రాధ, రాజారెడ్డి, కూటమి నాయకులు మహేష్ యాదవ్, దూది శివ, కార్పొరేషన్ ఎస్ఈ శ్యామ్ సుందర్, డీసీపీ మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో మోసం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్ పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై ఈస్ట్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. ఎస్‌బీఐ కాలనీకి చెందిన జమున రిలయన్స్ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తోంది. తిమ్మినాయుడుపాళెంకు చెందిన సుధాకరరెడ్డి ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టుబడిపెడితే అధిక మొత్తంలో వస్తాయని ఆమెను నమ్మించాడు. ఆమె నుంచి రూ.15 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఆమె శుక్రవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుపతిలో జగన్నాథ రథయాత్ర


తిరుపతిలో చేపట్టిన జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు.. ఉత్సవర్లకు హారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఒడిశా చైర్ ఆధ్వర్యంలో జగన్నాథ కల్చర్ అండ్ చైతన్య ఫిలాసఫీ రీసెర్చ్ సెంటర్ నుంచీ ఈ కార్యక్రమం ముందుకు సాగింది. సంస్కృత వర్సిటీ నుంచీ నగరంలోని ప్రధాన మార్గాల్లో జగన్నాథ రథయాత్ర సాగింది. జగన్నాథుని కృప జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంపైనా, భక్తులపైనా ఉండాలని ఇస్కాన్ మందిరం ఉపాధ్యక్షుడు రూపేశ్వర్ చైతన్య ప్రభు కోరుకున్నారు. సంస్కృత యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటనారాయణరావు ఉత్సవమూర్తులను మోసుకొని వచ్చి జగన్నాథుని రథంపై పెట్టారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక జ్ఞానాన్నీ రాబోయే తరాలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఒడిశా చైర్ డైరెక్టర్ జ్ఞానారంజనపండా మాట్లాడుతూ.. యూనివర్సిటీలో జగన్నాథ రీసెర్చ్ సెంటర్ ద్వారా జగన్నాథుని వైభవాన్ని ఈ తరానికి తెలియ చేస్తున్నామని తెలిపారు. పూరీ తరహాలోనే సంప్రదాయబద్ధంగా తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంతశుక్లా, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ రాధాగోవిందత్రిపాఠి, ఒడిశా చైర్ అడ్వైజర్ శంకరనారాయణ, వార్డెన్ వెంకటరావు, పీడీ సేతూరాం, విద్యార్థులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి సాక్షాత్కారం


తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారు శుక్రవారం రాత్రి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు అర్చకులు అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళదాం

మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నేతలు

తిరుపతి (జీవకోన), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళతామని మాజీ మంత్రి, వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించే కార్యక్రమాన్ని పద్మావతీపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారంలోకి రాగానే తుంగలో తొక్కారని విమర్శించారు. వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చంద్రబాబు మోసం చేసిన తీరుపై వివరించాలని తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరూ నిర్వహించాలని, కేసులకు భయపడవద్దని అన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కార్యక్రమ వివరాలను స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, వైసీపీ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, విజయానందరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సునీల్, రాజేష్, కృపాలక్ష్మి, వెంకటేగౌడ, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయవాది లూథ్రా



తిరుమల, జూన్27(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఎండోమెంట్ సెక్రటరీ వినయ్‌చంద్, ఎంఎల్సీ బీదా రవిచంద్ర, తెలంగాణ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కర్ణాటక మంత్రి శివానంద్ పాటిల్, ఎంపీ ఎంసీ సుధాకర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమర్య స్పోర్టిన్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కమ్ టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత, సంగీత దర్శకుడు గురుకిరణ్ శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

విద్యుత్ అదనపు లోడ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), జూన్27(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తున్నట్లు తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల వినియోగదారులకు ఏపీఈఆర్‌సీ ఈ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 50 శాతం రాయితీ కల్పిస్తోందని వెల్లడించారు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటి సర్వీసు తీసుకుంటున్న సమయంలో దరఖాస్తులో అంగీకరించిన లోడ్ కంటే ఎక్కువ వినియోగిస్తున్న వారు ఈ అవకాశాన్ని పొందవచ్చని వివరించారు.

దర్శనం పేరుతో భక్తులకు కుచ్చుటోపీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం టికెట్లు ఇప్పించి, దర్శనం చేయిస్తామని నమ్మించి రూ.43వేలు తీసుకున్న ఘటనలో ఇద్దరు వ్యక్తులపై అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేశారు. తిరుపతికి చెందిన పోతన రెడ్డి, శేఖర్ కొంతకాలంగా దర్శనాల పేరుతో తిరుమలలో భక్తులను మోసం చేస్తూ డబ్బు వసూలు చేస్తున్నారు. ఇటీవల కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్, అతని స్నేహితుడు శ్రీవారి దర్శనం కోసం వారిని సంప్రదించారు. వారి మాటలు విని అడిగిన డబ్బులు ఇచ్చి గురువారం దర్శనం కోసం తిరుపతికి వచ్చారు. ఇక్కడకు వచ్చిన తర్వాత వారు ఫోన్ తీయకపోవడంతో బాధితుడు శ్రీనివాస్ అలిపిరి సీఐ రాంకిషోర్‌కు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఉద్యోగి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఉద్యోగి మృతి చెందిన ఘటన శుక్రవారం ఎమ్మార్‌పల్లె వద్ద చోటు చేసుకుంది. ఎస్వీయూ సీఐ రామయ్య వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం ముదివెంగనపల్లికి చెందిన తులసి తిరుపతికి చెందిన లైన్‌మ్యాన్ నరసింహులు వద్ద పనిచేస్తున్నాడు. ఎమ్మార్‌పల్లె వద్ద పోల్ ఎక్కి పనులు చేస్తుండగా షాక్‌కు గురై కిందపడి మృతి చెందాడు. సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలో చెరువులు, కుంటలు

యథేచ్ఛగా మట్టి తరలింపు, కుచించుపోతున్న చెరువులు, కనుమరుగవుతున్న కాలువలు, పట్టించుకోని అధికారులు




పాకాల సమీపంలోని బొమ్మయ్యకుంట ఆక్రమణ, ఎర్రమరెడ్డి చెరువులో మట్టి తరలించేయడంతో ఏర్పడ్డ గోతులు

పాకాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాకాల పరిసరాలలో చెరువుల, కుంటలు, వంకలు ఆక్రమణల పాలవుతున్నాయి. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వంకలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపునీరు సక్రమంగా చెరువులకు చేరడం లేదు. పాకాల సమీపంలోని బొమ్మయ్యకుంట పట్టణానికి ఆనుకొని వుండడంతో కొంత కొంత పూడ్చుకుంటూ వచ్చేశారు. పలు నిర్మాణాలు వెలిశాయి. మరోవైపు గతంలో పంచాయతీ చెత్త ఈ కుంటలోకి తరలించడంతో పాక్షికంగా పూడిపోయింది. చెరువు స్థలంలోనే ప్రభుత్వ వ్యాయామశాల, వాటర్ ప్లాంట్, పక్కాభవనాలు నిర్మించారు. వీటిని ఆనుకొని ఆక్రమించుకోవడానికి పలువురు ప్రయత్నిస్తున్నారు. రైల్వే ప్రహరీ నుంచి ఈ కుంటకు వచ్చే నీటి కాలువ చాలావరకు ఆక్రమణకు గురైంది. మరోవైపు చెరువు కట్టపై ముళ్లకంపలు పెరిగి చిట్టడవిలా మారిపోయింది. పాకాల భారతంమిట్ట సమీపంలోని సామిరెడ్డి ఒడ్డు చెరువు ఆక్రమణలకు అడ్డాగా మారింది. ఈ చెరువుకు నీళ్ల వచ్చే కాలువ ప్రభుత్వ హైస్కూల్ నుంచి సామిరెడ్డి ఒడ్డు వరకు కబ్జాలో ఉంది. పాకాల రెవెన్యూ పరిధిలోని ఇరంగారిపల్లె పంచాయతీ నేంద్రగుంట రైల్వేగేటు సమీపంలోని ఎర్రమరెడ్డి చెరువులోని మట్టిని రియల్ వెంచర్ల యజమానులు తరలిచేశారు. దీంతో చెరువుల్లో భారీ గోతులు ఏర్పడ్డాయి.

రక్షించే వారేరి..?

వాల్టా చట్టం అమలు చేసి చెరువులు, కుంటలు, వాగులు, వంకలు సర్వే చేసి హద్దులు గుర్తించి ట్రెంచ్ వేసి రక్షించుకోవలసి వుంది. ఆక్రమణలు తొలగించి చెరువుల్లోకి వర్షపు నీరు చేరేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దళితుల ఆలయ ప్రవేశం అడ్డగింత

● అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన



చంద్రగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం హరిజనవాడకు చెందిన తమను కనకదుర్గమ్మ ఆలయంలోకి రాకుండా ఆలయ నిర్వాహకులు అడ్డుకున్నారని ఆరోపిస్తూ దళితులు చంద్రగిరిలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. వారి కథనం మేరకు.. శ్రీనివాసమంగాపురం హరిజనవాడకు చెందిన సుందరమ్మ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి వెళ్లారు. అయితే ఆలయ నిర్వాహకులు రామ్‌సింగ్, మరి కొంతమంది ఆమెను అడ్డుకున్నారు. దీనిపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దళితులు అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.వడ్డేపల్లె పంచాయతీ అమ్మగారిపల్లె గంగమ్మతల్లి ఆలయ ఆవరణంలో నూతనంగా నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్ ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం ప్రారంభించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.8.5లక్షలతో ఈ ప్లాంట్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నాగరాజనాయుడు, టీడీపీ నాయకులు చెన్నకేశవరెడ్డి, కె.సావిత్రి, బొల్లినేని మహేష్‌కుమార్, సుధాకర్‌నాయుడు, ప్రభాకర్ నాయుడు, జేజబ్బ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, చాముండేశ్వరి అధికారులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి వారాహి అలంకారంలో భక్తులకు దర్శనం



రామచంద్రాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలో వెలసి ఉన్న శ్రీశక్తిపీఠంలో శ్రీవారాహి దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో శుక్రవారం శ్రీలక్ష్మీవారాహి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభంగా జరుగుతున్నాయి. అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం



రామచంద్రాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి వారుచేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వర్, వెంకట్రామయ్య, రాజశేఖర్‌రెడ్డి, దిలీప్‌కుమార్, బ్రహ్మం, శ్రీరాములు, విశ్వనాథం, భార్గవి, మునిరాజ, లీలారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

భాకరాపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో నూతనంగా నిర్మించిన జేసీఆర్ ఎడ్యువ్యాలీ అనే ప్రైవేటు పాఠశాలను ప్రారంభించారు ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో మెరుగైన విద్య అందించే దృఢ సంకల్పంతో జేసీఆర్ ఎడ్యువ్యాలీ పాఠశాలను ఏర్పాటు చేశారని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, సుబ్రహ్మణ్యం, ఆర్‌వి రమణారెడ్డి, వెంకటరత్నం, మల్లికార్జునరెడ్డి, క్రిష్ణమూర్తి, కుమార స్వామిరెడ్డి, చంద్రశేఖర్, గురుమూర్తి, రమేష్ రెడ్డి, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

చెవిరెడ్డి అరెస్టుకు నిరసనగా ధర్నా

రామచంద్రాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టును నిరసినగా ఆర్‌సీపురంలో శుక్రవారం నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ధర్నాకు దిగారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, నాయకులు కేశవులు, చిన్నియాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, యశ్వంత్, గిరిధర్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, పుష్పకాంతరెడ్డి పాల్గొన్నారు.

సామూహిక సెలవు కోరుతూ
ఎంపీడీవోకు కార్యదర్శుల వినతి



ఎంపీడీవో కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

భాకరాపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు కోరుతూ ఎంపీడీవో గిడ్డయ్యకు వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌కు తెలియజేయడానికి 28న శనివారం సామూహిక సెలవు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చామని తెలిపారు.

పంటలబీమా చేసుకోండి

తిరుపతిరూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్(2025-26)సీజన్‌కు సంబంధించి పంటల బీమా చేసుకోవాలని రూరల్ మండల వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. వరికి ఎకరానికి రూ.168, సజ్జపంటకి ఎకరానికి రూ.64 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వరికి ఆగస్టు 15, సజ్జకు జూలై 31లోగా బీమా చేసుకోవాలని వెల్లడించారు. వేరుశనగకు ఎకరాకు రూ.560, నిమ్మకి ఎకరాకు రూ.2,500 ప్రీమియం చెల్లించాలన్నారు. ఈరెండింటికీ జూలై15 వరకు గడువు ఉందని తెలియజేశారు. వివరాలకు 8331057843, 9666812006 ఫోన్‌నెంబర్లని సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ సదస్సు ప్రారంభం



ప్రారంభ సభలో పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం జాతీయ సదస్సు ప్రారంభమైంది. వ్యవసాయంలో సవాళ్లు-వాతావరణ అనుకూలిత ఆవిష్కరణలు అంశంపై చేపట్టిన రెండు రోజుల సదస్సులో పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. బెంగళూరు అగ్రికల్చర్ వర్సిటీ మాజీ డైరెక్టర్ శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యాజమాన్య పద్ధతి బాగుంటే మంచి దిగుబడి వస్తుందన్నారు. రాష్ట్ర రైతు ప్రాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ సహజ వ్యవసాయ విధానంతో పురోగతి సాధ్యమన్నారు. సీ శారదజయలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతికత పెరగాలని, రైతుల సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారం చూపాలని అన్నారు. అగ్రికల్చర్ కాలేజీ, ఆర్ఏఆర్ఎస్ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్తరహిత పంచాయతీలే లక్ష్యం



చిగురువాడలో చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో రామచంద్ర

తిరుపతిరూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వ పాలకులు నిర్ణయించారు. ఇంటింటి నుంచి సేకరించే చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా గ్రామాభి వృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ మేరకు పంచాయతీల్లో చెత్తసేకరణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుపతిరూరల్ మండలంలోని 37 సచివాలయాల పరిధిలో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ తిరిగి చేపడుతున్న చెత్తసేకరణ పనులను పర్యవేక్షించే బాధ్యతని ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. దీంతో శుక్రవారం చిగురువాడ పంచాయతీలో చెత్త సేకరణను ఎంపీడీవో రామచంద్ర పర్యవేక్షించారు. తడి, పొడిచెత్తలు కలిపి ఇవ్వకుండా వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పేరూరులో వాటర్ ప్లాంట్‌కి భూమిపూజ



తిరుపతిరూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ ఎన్టీఆర్‌కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5లక్షలతో ఏర్పాటు చేయనున్న మినరల్ వాటర్ ప్లాంట్‌కి శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర కలసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నాగూరు శ్రీనివాసులు, కాయం వెంకటేష్, మహేష్, ముకుందరెడ్డి, గంగాధర్, కార్యదర్శి రెడ్డి జ్యోతీశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు పంచాయతీ కార్యదర్శిగా వెంకటేశులు



భాకరాపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు పంచా యతీ కార్యదర్శిగా టీ.వెంకటేశులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న గిరిబాబు దీందార్లపల్లి పంచాయతీకి బదిలీ కాగా వెంకటేశులు తొట్టంబేడు మండలం రౌతు సురమాల నుంచి ఇక్కడికి వచ్చారు.

తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడి దర్శనం



తిరుచ్చి వాహనంపై దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణ సమేత హనుమంతు స్వామివార్లు

చంద్రగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడి ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యసేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారి సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ సమేత సమేత హనుమంతుడి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణం

చంద్రగిరిలో వెలసిన కోదండరామాలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. సీతా రామలక్ష్మణ సమేత హనుమంతుడి ఉత్సవర్లను ఆలయ ఆవరణలో ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో పార్థసారథి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణయ్య, అర్చకులు శ్రీనివాసబట్టర్, నరసింహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ



గోడౌన్‌లో ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాత విమానాశ్రయం సమీపంలోని ఈవీఎంల గోడౌన్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం ఈవీఎంల గోడౌన్‌లోని పరికరాలను పరిశీలించారు. గోడౌన్‌లో భద్రపరిచిన, ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను, భద్రత ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి, ఎస్‌డీసీ సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులు పంచలేదని తల్లిదండ్రులపై దౌర్జన్యం

● బంగారు నగలు, కారు లాక్కెళ్లిన కుమారుడు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆస్తులు పంచకపోవడంపై కుమారుడు, కోడలు దౌర్జన్యం చేసి కారు, బంగారు నగలు లాక్కెళ్లిన ఘటన శుక్రవారం తిరుపతి అర్బన్ మంగళంలో చోటు చేసుకుంది. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు.. రిటైర్డు ప్రొఫెసర్ మధుసూదనరెడ్డి, ప్రసూన దంపతులు మంగళంలోని ఒక అపార్టుమెంటులో కాపురమున్నారు. వీరి కుమారుడు గౌతం, కోడలు శ్రీకన్య ఇంటికెళ్లి ఆస్తి పంచాలని డిమాండు చేశారు. ఇప్పటికిప్పుడే సాధ్యంకాదని కొద్ది రోజులు వేచి వుండాలని వారు చెప్పడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. తల్లిదండ్రులపై కుమారుడు, కోడలు దాడి చేసి కొట్టారని సీఐ చెప్పారు. అనంతరం తండ్రికి సంబంధించిన కారు, 50 గ్రాములు బంగారు నగలు లాక్కెళ్లారన్నారు. బాధితుడు మధుసూదనరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అజిత కేసు నమోదు చేశారు.

నైట్ బీట్లు పటిష్ఠంగా నిర్వహించండి



బీట్ కానిస్టేబుళ్లకు ఆదేశాలు ఇస్తున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నెరవిభాగం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నైట్ బీట్లు పటిష్ఠంగా నిర్వహించాలని ఈస్ట్ సీఐ శ్రీనివాసులు ఆదేశించారు. ఈస్ట్ సర్కిల్ పరిధిలో నైట్ బీట్లకు సంబంధించిన పోలీసులకు శుక్రవారం విధులు కేటాయించారు. ప్రధానంగా రాత్రి రెండు గంటల నుంచి తెల్లవారు జామున ఐదు గంటల వరకు విధులు నిర్వహించాలన్నారు. అనుమానితులు కనిపిస్తే విచారించి, అవసరమైతే స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తీసుకుని రోడ్లపై తిరుగుతూ రౌడీయిజం చేసే వారిని అరెస్టు చేయాలన్నారు. సందులు, గొందుల్లో తిరిగి రాత్రి పూట దొంగతనాలు, గలాటాలు జరగకుండా చూడాలన్నారు. రాత్రి 10 గంటల పైన ఎవరూ అనవసరంగా తిరగకుండా చూడాలన్నారు. రాత్రి పూట నేరాలు, ఇంటి దొంగతనాలు జరగ కుండా చూడడం, వైన్ షాపులు, బార్లు, అన్ని దుకాణాలు సమయానికి మూయించడం చేయాలన్నారు. ఎక్కడైనా ఘటనలు జరిగితే మీరే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఓ భవనంపై నుంచి పడి పెయింటర్ రామ్మూర్తి (39) శుక్రవారం మృతి చెందారు. భవానీనగర్‌లోని ఓ భవనానికి మేస్త్రీ అయిన చంద్రతోపాటు నలుగురు మనుషులు పెయింట్ వేయడానికి ఒప్పుకొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ముందుభాగంలో పని పూర్తి చేద్దామని చంద్రతో పాటు వినోద్, చంద్రన్న, రామూర్తి మిద్దెపైకి వెళ్లారు. పై నుంచి దారం కట్టి మొదటి భాగంలో వినోద్, చంద్రన్న పట్టుకోగా.. కింద భాగంలో కట్టిన చెక్కపై రామ్మూర్తి కుర్చున్నారు. పైనుంచి మెల్లగా కిందకు దించుతుండగా రామ్మూర్తి పెయింట్ కొడుతున్నారు. ఈ క్రమంలో సాయంత్రం 4 గంటల సమయంలో రెండో ఫ్లోర్ వద్ద రామ్మూర్తి జారి కింద పడ్డారు. పైనున్న వరు కిందకు వెళ్లి చూసే సరికి రామ్మూర్తి తీవ్రగాయాలతో మృతిచెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు రోజుల్లో 8230 మంది ఇళ్లకు రేషన్



తిరుపతిలో సరుకులు అందజేస్తున్న సీఎస్ డీటీ యుగంధర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక రేషన్ షాపుల్లోనే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులకు మాత్రం నిర్ణీత రోజుల్లో ఇళ్ల వద్ద చేరుస్తున్నారు. ఈ క్రమంలో జూలై నెల సరుకులను గురువారం నుంచే వీరికి ఇళ్ల వద్ద అందజేస్తున్నారు. ఇలా గురు, శుక్ర వారాల్లో జిల్లాలో 8230 మందికి ఇళ్ల వద్దకు రేషన్ సరకులు తీసుకెళ్ళి డీలర్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 6,61,534 మంది కార్డుదారులు ఉండగా.. దివ్యాంగులు, 60 ఏళ్ళు పైబడిన వారు దాదాపు 61,561 మంది ఉన్నారు. మిగిలిన వారికి ఈనెలాఖరులోగా సరుకుల పంపిణీ పూర్తి చేయనున్నారు.

నకిలీ గోల్డు కుదువ పెట్టుకున్న కేసులో ఇద్దరిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నకిలీ గోల్డు నగలు కుదువ పెట్టుకుని రుణం మంజూరు చేసిన ఘటనలో ప్రైవేటు కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులపై ఈస్ట్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతిలో ఎక్స్ఏఎల్ఎం ఎక్స్‌వా పిన్ వెస్ట్ లిమిటెడ్ కంపెనీలో తిరుపతికి చెందిన అనంతగౌరి తన అవసరాల నిమిత్తం 100 గ్రాములు బంగారు నగలు కుదువ పెట్టి రుణం తీసుకున్నారు. మేనేజర్ అరుణ్‌కుమార్, కస్టోడియన్ శివశంకర్ రెడ్డి ఆ బంగారాన్ని పరిశీలించకుండా కుదువపెట్టుకుని డబ్బులు ఇచ్చారు. దీంతో శుక్రవారం కంపెనీకి చెందిన రీజనల్ మేనేజర్ హిమగిరి కంపెనీకి వచ్చి నగలు తనిఖీ చేశారు. దీనిపై కుదువ పెట్టిన బంగారు నగల్లో 50 గ్రాములు నకిలీవిగా గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు.

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలకు
వైభవంగా ధ్వజారోహణం




ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు. ప్రత్యేకాలంకారంలో స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి- చెన్నై రోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపీ నేతలు మండపం నుంచి దర్భ, తాడును ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ కలశ పూజలు, వాస్తు, పూర్ణాహుతి హోమం, కంకణ పూజ జరిపారు. గర్భగుడిలో ప్రత్యేకపూజల అనంతరం ధ్వజారోహణం చేపట్టారు. ధ్వజస్తంభంపైకి చీరలను కట్టిన దర్భతాడును అధిరోహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, టీడీపీ నేతలు విజయకుమార్, చెంచయ్య నాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మండపంలో పాండవ ఉత్సవమూర్తులకు మొదట అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగిస్తూ ధర్మరాజులస్వామి ఆలయానికి చేరుకున్నారు.



మూడు కార్లు, లారీ ఢీ



ఒకదాన్నొకటి ఢీకొన్న కార్లు, లారీ

తడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూడు కార్లు, ఓ లారీ ఒకదాన్నొకటి వెనుక నుంచి ఢీకొన్న ఘటన తడ మండలం చేనిగుంట వద్ద శుక్రవారం జరిగింది. నెల్లూరు - చెన్నై జాతీయ రహదారిపై తడ మండలం చేనిగుంట వద్ద పనులను జరుగుతుండడంతో బారికేడ్ పెట్టారు. దీనిని గమనించని ఓ కారు డ్రైవరు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఆ కార్లను మరో లారీ కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో నాలుగు వాహనాలూ స్వల్పంగా దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ గోదాము కూల్చివేశారని ఫిర్యాదు

తడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తమ గ్యాస్ గోదామును కూల్చివేశారంటూ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తడలోని బోడిలింగాలపాడు శివాలయం ఎదురుగా సుభాషిణి గ్యాస్ ఏజెన్సీకి గోదాము ఉంది. ఆ స్థలం విషయమై వివాదాలు ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ సాయంతో గోదామును నేలమట్టం చేశారు. దీంతో సదరు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోదాములో సుమారు రూ.10 లక్షల విలువైన సిలిండర్లు ఉన్నాయని, గోదాము నేలమట్టం చేసినవారే వాటిని ఎత్తుకెళ్లి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా బాధలు కలెక్టర్‌కు చెప్పుకుంటాం

సామూహిక సెలవు ఇవ్వండి
పంచాయతీ కార్యదర్శుల వినతి



ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

నాయుడుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు మంజూరు చేయాలంటూ శుక్రవారం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో పనిఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయాన్నే 6గంటలకు మస్టర్లకు హాజరు కావడంతో పాటు, విధుల నిర్వహణ నిర్ణీత కాలంలో చేయాల్సి వస్తోందన్నారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ బాధలు చెప్పుకునేందుకు వీలుగా కార్యదర్శులందరికీ సెలవుల మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోవిందయ్య, గోపాల్, రమేష్, భారతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కూటమి ప్రభుత్వంపైనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆశలు



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

పుత్తూరు అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు మేలు జరుగుతుందని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు మహేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలియజేశారు. 2014-19 కాలంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి 50 శాతం వేతనం పెంచి ఆదుకున్న చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. ఆప్కాస్‌లో ఉన్న చిన్నపాటి లోపాలను సరిచేసి మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ విభాగం అధ్యక్షులు గణేష్‌కుమార్, సమాచార హక్కుల నివేదిక కార్యదర్శి మురగారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కృష్ణారెడ్డి, అంకయ్య, ప్రభాకర్, సర్వనా, నాగ, వెంకటేష్, సుభాషిణి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

వడమాలపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్వీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థులు విద్యాసామగ్రి వితరణగా అందజేశారు. తల్లిదండ్రులు దొమ్మరాజు జయదేవరాజు, ధనలక్ష్మిల జ్ఞాపకార్థం పిల్లలు యువశ్రీ, శ్రీనివాసవర్మలు సుమారు రూ.25వేల విలువ కలిగిన సామగ్రి అందజేశారు. దాతలు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా విద్యార్థులకు సాయం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు నరేష్, రంగయ్య, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణల ఫిర్యాదుపై పరిశీలన



ఎనమలపాళ్యం వద్ద రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

వడమాలపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనమలపాళ్యం ఆది ఆంధ్రవాడ సమీపంలో భూ ఆక్రమణల ఫిర్యాదుపై సంబంధిత భూములను, రికార్డులను శుక్రవారం సర్వే ఆఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇటీవల ఎనమలపాళ్యం ఆది ఆంధ్రవాడ వాసులు ప్రజా సమస్యల పరిష్కర వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశామేరకు సంబంధిత భూములను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. తిరుమణ్యం రెవెన్యూ సర్వే నెంబరు 195లో పూరా విస్తీర్ణంపై సమగ్రంగా రికార్డులు పరిశీలించాలని స్థానికులు కోరారు. ప్రభుత్వం ఎనమలపాళ్యం ఆది ఆంధ్రవాడ అభివృద్ధి కోసం కొనుగోలు చేసిన భుమికి సంబంధించి రికార్డులను తారుమారు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిగిలి ఉన్న 1.90 ఎకరాల భూమిని గుర్తించి సర్వే చేసి ఇళ్లు లేనివారికి పట్టాలు ఇప్పించాలని కోరారు. పెద్ద చెరువు ఒరవ కాలువ పోరంబోకు, చిలకల బండ పోరంబోకు స్థలాలను గుర్తించాలని స్థానికులు కోరారు. శాటిలైట్ సర్వే రికార్డుల ద్వారా ఆక్రమణలను గుర్తించాలని కోరారు. పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని సర్వే ఆఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జరీనా, ఎస్ఐ ధర్మారెడ్డి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు జగన్నాథ రథయాత్ర

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో శనివారం జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేశారు. సూళ్లూరుపేటలోని షార్ బస్టాండు వద్ద మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమయ్యే రథయాత్ర షార్ వై జంక్షన్ మీదుగా ఫ్లై ఓవర్, జీఎన్‌టీ రోడ్డుకు చేరుకుని బజారు వీధుల గుండా చెంగాళమ్మ ఆలయ వద్దనున్న శ్రీనగర్ కాలనీలో ముగుస్తుంది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయాలని ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తడ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు పనుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తడ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళి తెలిపారు.

టీడీపీలో కష్టపడేవారికి సముచిత స్థానం: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, నాయుడుపేట టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడేవారికి సముచిత స్థానం కల్పిస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణం శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని శ్రీనివాస మినీ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఓజిలి మండల టీడీపీ అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికలకు విచ్చేసిన వందలాది టీడీపీ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడం కాయమని అన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ, టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని గ్రామ కమిటీ అధ్యక్షల నుంచి వివరాలను తీసుకుని పార్టీ అధిష్టానానికి పంపుతామన్నారు. అదే సమయంలో ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా కార్యకర్తల అభిప్రాయం తీసుకోవడం జరుగుతుందన్నారు. నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంగా పనిచేయాలన్నారు. అనంతరం ఓజిలి మండలంలోని గ్రామ కమిటీ నాయకుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. కాగా, 30 ఏళ్లుగా పార్టీ జెండా మోసిన తకు న్యాయం చేయకుండా వైసీపీ నుంచివచ్చిన వారికి ప్రాధాన్యం కల్పిచడం ఏమిటిని ఆవేదన వ్యక్తం చేశారు. సమావే శంలో టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు, నియోజక వర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, రాపూరు పరిశీలకుడు రత్నయ్య పాల్గొన్నారు.

టీడీపీ పటిష్ఠతే లక్ష్యంగా కమిటీల ఏర్పాటు: నెలవల



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠ పరిచే లక్ష్యంతో సంస్థాగత ఎన్నికల కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస మినీ ఫంక్షన్ ఆవరణలో పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మండల కమిటీ ఎంపికకు సంబంధించి ఇరు వర్గాలు బల ప్రదర్శన చేశాయి. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్యకు మద్దతుగా వందలాది మంది కార్యకర్తలు తరలి వచ్చారు. అయితే సభ్యత నమోదు కార్డు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ పటిష్ఠమైన నాయకత్వం కోసం అధిష్టానం చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీ జెండా మోసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్, నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు, రాపూరు పరిశీలకుడు రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. శుక్రవారం తిరుపతిలో కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పలు పాఠశాలలను విలీనం చేయడంతో కొన్ని గ్రామాల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సమీప పాఠశాలల్లో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చెరువుకట్టను ఆధునికీకరించడంతో పాటు వాకింగ్ ట్రాక్, పార్కు వంటి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్ కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వెంకటగిరి టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యూపీహెచ్‌సీ డాక్టర్ రాజేష్ అన్నారు. శుక్రవారం పూలే పాఠశాల హాస్టల్, బాలికల ఉన్నత పాఠశాల హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. చుట్టుపక్కల పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, చెత్త నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం డ్రైనేజీ కాలువను పరిశీలించి సూచనలిచ్చారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గూడూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతీ శిశుమందిరంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ పేదవిద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎన్ఆర్ఐలు నిరీష, నిష్య, నివ్య ప్రోత్సాహక బహుమతులను అందించడం సంతోషంగా ఉందన్నారు. మురళీరెడ్డి, వెంకటరమణయ్య, సనత్ కుమార్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భర ద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 468కి చేరింది. సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్‌కు చెందిన పెరింబేడి షణ్ముగం (64) మరణాంతరం ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను దానం చేశారు. సేకరించిన కార్నియాలను చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు చంద్ర బాబు, ఆలపాటి అశోక్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని భవిత కేంద్రంలో శుక్రవారం అంధుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్‌పీఆర్‌టీ సేవాసంస్థ అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో హెలెన్ కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. భవిత ఉపాధ్యాయురాలు భార్గవి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సీఈవో బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఎస్‌బీటీఈ పరీక్షల్లో 9 జీపీఏ కంటే ఎక్కువ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్ తెలిపారు. శుక్రవారం కళాశాల సీఈవో బ్రహ్మయ్య, ఏవో మనోహర్ అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించి సత్కరించారు.

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలకు వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం సందర్భంగా ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేకాలంకారంలో స్వామి అమ్మవార్లు



శ్రీకాళహస్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపసీ నేతలు మండపం నుంచి దర్భ, తాడును ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ కలశపూజలు, వాస్తు, పూర్ణాహుతి హోమం, కంకణ పూజ జరిపారు. గర్భగుడిలో ప్రత్యేకపూజల అనంతరం ధ్వజారోహణం చేపట్టారు. ధ్వజస్తంభంపైకి చీరలను కట్టిన దర్భ తాడును అధిరోహించారు. ఆలయ అధికారులు, టీడీపీ నేతలు విజయ కుమార్, చెంచయ్య నాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మండపంలో పాండవ ఉత్సవమూర్తులకు మొదట అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగిస్తూ ధర్మరాజులస్వామి ఆలయానికి చేరుకున్నారు.







సీజేఎఫ్ఎస్ భూముల్లో కల్కిట్రస్టు భూమి పూజ చేసిన దృశ్యం - తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్తులు

ప్రభుత్వ భూమిలో కల్కిట్రస్టు భూమిపూజ

తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారివెట్టు గ్రామంలో దళితులకు చెందిన సీజేఎఫ్ఎస్ భూముల్లో వేసిన లేవుట్‌లో కల్కి ట్రస్టు వారు శుక్రవారం భూమి పూజ చేయడంపై తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామస్తులు, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు తహసీల్దార్ శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వరదయ్యపాళెం మండలంలోని ఆ పార్టీ నాయకులు, కల్కి ట్రస్టు వారు తలారివెట్టు పంచాయతీలోని సర్వే నెంబర్లు 117, 130, 131, 135, 136 లోని 14.90 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను దళితులకు తక్కువ ధర చెల్లించి కొనుగోలుచేసి, ప్రభుత్వం నుంచి అధిక ధర చొప్పున వసూలు చేసుకున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఈ భూముల్లో వరదయ్యపాళెం మండలంలోని వైసీపీ నాయకులు, వారి అనుచరులకు ఇంటి పట్టాలు ఇచ్చారని చెప్పారు. మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, వేణుగోపాలపురం పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలు ఇంటి పట్టాలకు అర్హులైన వారు ఉన్నప్పటికీ వారిలో ఏ ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. మండలానికి సంబంధించిన భూమిని వరదయ్యపాళెం మండల వాసులకు ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో కల్కి ట్రస్టు వారు భూమి పూజ చేయడం ఎంత వరకు సమజసమని అన్నారు. ఈ భూములను తక్షణం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, కల్కి ట్రస్టుపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ భూమిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

గూడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఎస్ఆర్‌పీ ట్యాకీస్ సెంటర్‌లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణంకు వచ్చే శాంతినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ప్రజల అసౌకర్యాన్ని గుర్తించిన ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సూచించారన్నారు. దీంతో ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణానికి వెళ్లే వాహనాలు శాంతినగర్ అండర్ బ్రిడ్జి ద్వారా యథావిధిగా వెళతాయన్నారు. గాంధీనగర్, మాళవ్యానగర్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఎస్ఆర్‌పీ ట్యాకీస్ మీదుగా పాత సంతరోడ్డు నుంచి అంబేద్కర్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి, చెన్నూరు వైపు నుంచి వచ్చే వాహనాలు పాత సంతరోడ్డు మీదుగా అంబేద్కర్ నగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి మీదుగా ఒకటో పట్టణంలోకి రాకపోకలు సాగించేలా శుక్రవారం నుంచి ఆంక్షలను అమలు పరుస్తున్నామన్నారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

దామరగుంట కాలనీకి దారి ఏర్పాటు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దారు, టీడీపీ నేతలు

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని దామరగుంట గిరిజన కాలనీలో శుక్రవారం అధికారులు, టీడీపీ నాయకులు పర్యటించారు. గత కొన్నేళ్లుగా ఈ కాలనీకి దారిలేక గిరిజనులు ఇబ్బందులుపడుతున్నారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, సర్వేయర్లు ఆ కాలనీని సందర్శించారు. పట్టాభూములను కొనుగోలు చేసి దారి ఏర్పాటు చేసేందుకు రైతులతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



కోటమ్మ గుడికాలనీలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు కాలనీల్లో పర్యటించిప్రభుత్వం అందించే పథకాలు, పాఠశాలలో వసతులను వివరించారు. పిల్లలను ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చేర్పాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు మహ్మద్ రఫీ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జయరామ్‌నగర్‌లో నివాసం ఉంటూ అదృశ్యమైన ముఖేష్ ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. కోట నుంచి పరారైన ముఖేష్ ముంబాయిలోని ఓ దుకాణంలో ఉన్నట్లు తెలిసిందని, రెండు రోజుల్లో ఇంటికి తీసుకు వస్తామని ఎస్ఐ చెప్పారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ



గోడౌన్‌లో ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాత విమానాశ్రయం సమీపంలోని ఈవీఎంల గోడౌన్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం ఈవీఎంల గోడౌన్‌లోని పరికరాలను పరిశీలించారు. గోడౌన్‌లో భద్రపరిచిన, ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను, భద్రత ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి, ఎస్‌డీసీ సుధారాణి, ఎన్నికల సీల్ సూపరింటెండెంట్ ప్రసాద్, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు




ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని 3ఎఫ్ జోన్‌హెడ్ మురళి అన్నారు. శుక్రవారం తొట్టంబేడు మండలంలోని శివనాథపురంలో మెగాప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రైతు నాగలక్ష్మి తన పొలంలో 155 ఆయిల్‌ఫాం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఆయిల్‌ఫాం సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు మోహన్‌నాయుడు, క్లస్టర్ ఆఫీసర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మినీ బైపాస్ విస్తరణతో భారీ నష్టం

● నిర్ణయం మార్చాలని సీఎంకు, డిప్యూటీ సీఎంకు, ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తూ ప్రజల సంతకాల సేకరణ

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణ శివారులోని మినీబైపాస్‌రోడ్డు విస్తరణ చేపడితే భారీగా వందలాది మంది స్థలాల యజమానులు నష్టపోతారని, ప్రభుత్వం ఆ నిర్ణయం మార్చుకోవాలని అధికారులు, పాలకులకు పలువురు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులో బసవయ్యపాళెం నుంచి తొట్టంబేడు వరకు సుమారు 21 సంవత్సరాల క్రితం వంద అడుగుల మినీ బైపాస్‌రోడ్డు కోసం స్థల సేకరణ చేశారు. తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి శ్రీకాళహస్తి-చెన్నై రహదారిని కలుపుతూ మినీ బైపాస్‌రోడ్డు ఏర్పడింది. వంద అడుగుల రోడ్డును ప్రతిపాదించినప్పటికీ 2013లో ఎక్కువ వాహనాల రద్దీ లేకపోవడంతో 50అడుగుల రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా వాహనాల తాకిడి పెరగకపోవడంతో నిర్మాణ అవసరం ఏర్పడలేదు. అయితే శ్రీకాళహస్తి నుంచి శ్రీసిటీని కలుపుతూ తడ వరకు రోడ్డు విస్తరణ చేసేందుకు ఇటీవల తుడా, ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వేచేపట్టారు. ఈ నేపథ్యంలో తడ రోడ్డుకు కనెక్టివిటీఉన్న మినీ బైపాస్‌రోడ్డును కూడా విస్తరించాలని ఇటీవల సర్వేచేశారు. మినీ బైపాస్‌లో కొన్ని చోట్ల మార్కింగ్ కూడా ఏర్పాటుచేశారు. 3.50కిలోమీటర్ల పొడవు ఉన్న మినీ బైపాస్ పట్టణంలో భాగంగా కలిసిపోయి అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో ఇక సగం రోడ్డు వేసేందుకు సేకరించిన స్థలం ఖాళీగా ఉన్నప్పటికీ మరింత విస్తరణ చేయడంతో ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలు కోల్పోవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు ప్రతిపాదన మానుకుని మినీ బైపాస్‌కు తూర్పు వైపున తొట్టంబేడు మండలం బీడీ కాలనీ నుంచి సాంబయ్య పాళెం మీదుగా కలపడం ద్వారా రెండు జాతీయ రహదారుల మధ్య సులభంగా కొత్త రహదారి ఏర్పడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈమేరకు మినీబైపాస్ ప్రాంత వాసులు శుక్రవారం సంతకాలు సేకరించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తుడా చైర్మన్, జాతీయ రహదారి అధికారులకు తమగోడును లేఖద్వారా మెయిల్‌లో సమర్పించారు.



సేకరించిన మినీ బైపాస్‌రోడ్డులోని స్థల యజమానుల సంతకాలు

ప్రమాదకరంగా దిగుడుబావి

● అదుపు తప్పిపడిపోతున్న మూగజీవాలు

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని పద్మశాలిపేటలో ఉన్న పాడుబడిన బీడు బావి ప్రమాదకర ప్రాంతంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని నడిబొడ్డు ప్రాంతం కావడంతో పద్మశాలిపేటలో పెద్ద ఎత్తున నివాసగృహాలు ఏర్పడ్డాయి. ఇక్కడ ఉన్న దిగుడుబావిని కొద్ది సంవత్సరాలుగా ఎవరూ శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు, పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. దీంతో భారీ విషసర్పాలు బావి నుంచి వీధుల్లోకి, కొన్ని సందర్భాల్లో ఇళ్లల్లోకి సైతం చొరబడుతున్నాయి. తాజాగా శుక్రవారం రెండు పెంపుడు కుక్కలు అదుపు తప్పి బావిలోపడ్డాయి. స్థానికులు టీడీపీ నేత ఉమేష్‌రావుకు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది బావిలోకి దిగి రెండు మూగజీవాలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దిగుడుబావి సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


బావిలో పడిన కుక్కలను వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శునకాల జనన నియంత్రణ శస్త్రచికిత్సపై ముగిసిన శిక్షణ


శిక్షణ ముగించుకున్న పశువైద్యులు

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో అనిమల్ కేర్ ల్యాండ్ ఆధ్వర్యంలో వరల్డ్‌వైడ్ వెటర్నరీ సర్వీసెస్ సహకారంతో శునకాల జనన నియంత్రణ శస్త్రచికిత్స విధానాలపై రెండువారాల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ రవికుమార్ పశువైద్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్‌బాబు, యుగంధర్‌నాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై పరాశరేశ్వరుడు


హంస వాహనంపై దర్శనమిస్తున్న చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామి

నారాయణవనం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో టీటీడీకి అనుబంధంగా ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం హంస వాహనంపై స్వామి, అమ్మవారిని ఊరేగించారు. ఉదయం అమ్మవారితో సహా స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి, హంస వాహనంపై అధిరోహింపజేసి వీణా దక్షిణా మూర్తి అవతారంలో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్‌సేవ



నారాయణవనం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో వెలసియున్న కళ్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్‌సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణతో ఊంజల్‌సేవను నిర్వహించారు. ప్రధానఅర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రేణిగుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది సీజనల్ వ్యాధులపై శుక్రవారం పట్టణంలోని బిస్మిల్లా నగర్, భగత్ సింగ్, వివేకానంద కాలనీలో పీహెచ్‌సీ డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, ఈనీటిని తాగడం ద్వారా డయేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు


బుగ్గ వీధిలో కాల్వ పూడిపోవడంతో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రేణిగుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గ వీధిలో కాల్వ నుంచి రోడ్డుపైకి మురుగునీరు పారుతోంది. రైల్వే కట్ట తూముకు వెళ్లే మార్గంలోని వీధిలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో రెండు రోజులుగా రోడ్డుపైకి మురుగునీరు పారుతోంది. దీనిపై స్థానికులు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కాలువలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి రావడంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఆ ప్రాంతంలోని కాలువలు శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా.. శనివారం నుంచి ఆ ప్రాంతంలోని కాలువలు శుభ్రం చేయిస్తామని తెలిపారు.

బీజేపీలో చేరిన పిచ్చాటూరు వైసీపీ నేతలు


వైసీపీ నేతలకు బీజేపీ కండువా కప్పి స్వాగతం పలుకుతున్న పురందేశ్వరి

పిచ్చాటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సునంద భర్త పాల పద్మనాభం, వైసీపీ రాష్ట్ర విద్యార్థి విభాగనేత గజేంద్ర బీజేపీలో చేరారు. శుక్రవారం రాజమండ్రిలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు మునిసుబ్రహ్మణ్యం, పల్ల మునిశేఖర్‌ల సహకారంతో వీరు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పద్మనాభం, గజేంద్రలకు పురందేశ్వరి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

వరుస దొంగతనాలు

● బెంబేలెత్తుతున్న మండల వాసులు

కేవీబీపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత వారంలో తిమ్మసముద్రంలో రెండు ఇళ్లల్లోని మహిళల మెడలోని బంగారు గొలుసులు తెంపుకుపోయారు. కాగా బుధవారం రాత్రి ఆరె గ్రామంలో ప్రకాష్ నాయుడి ఇంట్లో భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చోరీలకు పాల్పడుతున్నది పక్క రాష్ట్రానికి చెందినవారా.. లేక స్థానికులా అనే దానిమీద పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. ప్రకాష్ నాయుడి ఇంట్లో చోరీ జరిగిన సొమ్ము మొత్తం విలువ రూ.30లక్షలుగా పోలీసులు అంచనా వేశారు. బంగారు 114 సవర్లు, వెండి ఆరుకేజీలు, నగదు రూ.2లక్షలు అని పోలీసులు తెలిపారు. దీనిపై బృందాలుగా దర్యాప్తు ప్రారంభించామని, మండలవాసులు అధైర్యపడవద్దని పోలీసులు చెప్పారు.


ప్రకాష్ నాయుడి ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

పరిశ్రమలను వికేంద్రీకరించాలి


మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో జయచంద్రనాయుడు

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా పరిశ్రమలను వికేంద్రీకరించాలని తొట్టంబేడు మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత జయచంద్ర నాయుడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. శుక్రవారం తిరుపతిలో జరిగిన ఎంఎస్‌ఎంఈ దినోత్సవంలో ఆయనను కలిసి విన్నవించారు. వికేంద్రీకరణ ద్వారా కార్మికులు వలస వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. ఉపాధి అవకాశాలు కూడా మెండుగా లభిస్తాయన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

కలంకారి, కొయ్యబొమ్మల కళలను ప్రోత్సహించండి


మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న దశరథాచారి

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో కలంకారి, కొయ్యబొమ్మలు తదితర వాటిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కళాసృష్టి కార్యదర్శి దశరథాచారి కోరారు. తిరుపతిలో మంత్రిని శుక్రవారం ఆయన కలిసి విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలంకారి వస్త్రంతో సత్కరించి, ముక్కంటి తీర్థప్రసాదాలనుఅ ందజేశారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలి

● సమగ్ర శిక్ష ఏపీసీ గౌరీశంకర్‌రావు


ప్రత్యేక ప్రతిభావంతులతో మాట్లాడుతున్న ఏపీసీ గౌరీశంకర్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు తెలిపారు. మండలంలోని నెలవాయి, బీఎన్‌కండ్రిగ గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో విద్యార్థుల చదువు విషయంపై ఆరా తీశారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను పరిశీలించి, యూనిఫామ్ వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీఎంశ్రీ పాఠశాలకు సంబంధించిన కెమిస్ట్రీ ల్యాబ్, బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టు, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. భవిత పాఠశాల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, హెచ్‌ఎంరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని ఉత్తమ దారిలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శుక్రవారం పాలమంగళం(దక్షిణం) ఉన్న జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలితోపాటు ఏడుగురు ఉపాధ్యాయులు బదిలీ కావడంతో, వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని పౌరులను చిన్నతనం నుంచే క్రమశిక్షణతో పాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ముందుంటారని చెప్పారు. అనంతరం బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను పూలమాలవేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలమంగళం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ


నీర్పాకోటలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే తగిన వైద్యం అందించడం ద్వారా నివారించవచ్చునని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నీర్పాకోట, ఆలత్తూరు గ్రామాల్లో స్విమ్స్ శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో రెండు పింక్ బస్సుల్లో మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ కోసం పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఉదయ్‌కుమార్, హరిత, చైతన్యభాను, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

● డీపీవో సుశీలదేవి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో సుశీలదేవి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచకపోతే కార్యదర్శులపై చర్యలు తప్పవని డీపీవో సుశీలదేవి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కారణి పంచాయతీలో పర్యటించి సంపద కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షా కాలం మొదలవుతుండటంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలుచేపట్టాలని ఆదేశించారు. దోమల నివారణకు మురుగునీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి వీధుల్లో బ్లీచింగ్ చేయించాలన్నారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీటి బోర్లకు ప్లాట్‌ఫారం నిర్మించి మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఈవోపీఆర్డీ రాజశేఖర్, సర్పంచ్ పద్మమ్మ పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సీఎస్‌వో

ఏర్పేడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి) ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని శుక్రవారం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సీఎస్‌వో వికాస్ కుమార్ సింహ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ నిర్వహించిన హిందీ భాషా పరీక్షల్లో పట్టణానికి చెందిన గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహించారు. ఈ పాఠశాల నుంచి 73మంది విద్యార్థులు హాజరు కాగా, ప్రథమ శ్రేణిలో ప్రవేశిక, ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారద పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధాన ఆచార్యులు నాగేశ్వరరావు తెలిపారు. ప్రథమలో రేవతి, శ్రావణి, భార్గవి, అర్చనాంజలిబాయి, పల్లవి 93శాతంతో జిల్లాలో సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచారు. ఉత్తమ పరీక్షల్లో అమృత 90శాతం మార్కులతో జిల్లాలో రెండవ స్థానంలో నిలిచింది. శుక్రవారం వారిని ఉపాధ్యాయులు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

బాధితులకు పరామర్శ

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలానికి చెందిన ఆలత్తూరు వెంకటయ్య, సుజాతలు ద్విచక్ర వాహనంపై ఏర్పేడు మండలం పల్లంపేట వద్ద వస్తుండగా శుక్రవారం ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరికి తీవ్రగాయాలయ్యాయి. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు వీరిని పరామర్శించి, పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వారికి ప్రత్యేక వైద్యసదుపాయాలు కల్పించారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పిచ్చాటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులను అధిక ధరలకు అమ్మితే ఆ డీలర్లపై కఠిన చర్యలు తప్పవని పిచ్చాటూరు వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రైతులకు కావలసిన ఎరువులను సకాలంలో అందించాలని, కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తామనే నిబంధనలు విధించరాదన్నారు. ఎరువులు కొన్న ప్రతి రైతుకు రసీదులు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. రైతులు కూడా రసాయనిక ఎరువులను అధిక మోతాదులో ఉపయోగించకుండా భూసార పరీక్షల్లో సిఫార్సు చేసిన మేరకే వాడుకోవాలన్నారు. ఈ సీజన్‌లో వరి పంట కన్నా ఆరుతడి పంటలపై మక్కువ చూపాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

గుర్తింపు లేని సీఎస్‌ఐ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు వర్తించవు

పిచ్చాటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ గుర్తింపు లేని మూడు సీఎస్‌ఐ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పథకాలైన తల్లికి వందనం, మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించబడదని ఎంఈవో హేమమాలిని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సీఎస్‌ఐ పాఠశాలలను వెంగళత్తూరు, అడవి కొడియంబేడు, బంగాళా గ్రామాల్లో నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇలాంటి పాఠశాలలపై ముందుచూపుతో వ్యవహరించాలని ఎంఈవో సూచించారు.

ముక్కంటి సేవలో తెలంగాణ రాజభవన్ కోఆర్డినేటర్

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం తెలంగాణ రాజభవన్ కోఆర్డినేటర్ ప్రద్యుమ్న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సంఘం నాయకులు ఉదయ్‌కుమార్, ఆంజనేయులు, శివశంకర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, నాయకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు ప్రెస్, పోలీస్ స్టిక్కర్ల తొలగింపు


ద్విచక్ర వాహనాలకు ప్రెస్ స్టిక్కర్లను తొలగిస్తున్న పోలీసులు

రేణిగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్విచక్ర వాహనాలు, కార్లకు అంటించిన ప్రెస్, పోలీస్ స్టిక్కర్లను అర్బన్ పోలీసులు తొలగించారు. శుక్రవారం ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల కాలంలో అధిక మొత్తంలో అనర్హులు ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు వేసుకొని తిరుగుతూ దొంగ ఐడీ కార్డులు చూపుతూ జరిమానాల నుంచి తప్పించుకుంటున్నారు. కొంతమంది ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని నేరాలకు పాల్పడుతుండటం అధికమవుతుంది. దీన్ని అరికట్టాలనే పట్టణంలో అర్బన్ సీఐ జయచంద్ర నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఎటువంటి గుర్తింపు కార్డులు లేని పలు ద్విచక్ర వాహనాలకు, కార్లకు ప్రెస్, పోలీస్ స్టిక్కర్లను తొలగించారు. తొలగించిన వాహనాలకు మళ్లీ ప్రెస్ స్టిక్కర్ అంటిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సుధాకర్, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

శ్రీకాళహస్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సీఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌కు, ద్విచక్ర వాహనదారులకు ఖచ్చితంగా ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ వంటి అన్ని పత్రాలు ఉండాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

హాస్టల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది తనిఖీలు


బాలుడికి వైద్యపరీక్షలు చేస్తున్న మెడికల్ సిబ్బంది

ఏర్పేడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పారా మెడికల్ సిబ్బంది ఏర్పేడు బీసీ బాలుర వసతిగృహ పరిసరాలను, తాగునీరు వంటివాటిని శుక్రవారం పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, తులసీనాథ్, ఏఎన్‌ఎం రీటా, ఆశా వర్కర్లు లత, లోరాకుమారి, వసతి గృహ సంక్షేమాధికారి పల్లా వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.